

అవినీతిపై ఉక్కుపాదం

లంచాలు తీసుకుంటున్న అధికారుల భరతం పట్టేందుకు ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. వరుసగా దాడులు చేస్తూ అక్రమార్కులను పట్టుకుంటున్నారు. - 10లో..



ఆరోమా పంటలతో ఆర్థిక పరిపుష్టి

ఆరోమా పంటల సాగుతో రైతులకు ఆర్థిక పరిపుష్టి కలుగుతుందని నిషాంత్ ఆరోమా ఎండీ రమాకాంత్ హర్లాల్కా అన్నారు. - 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40 /31

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ముగ్గురు డీబార్

ఒంగోలు: ఇంటర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డీబార్ అయ్యారు. శుక్రవారం గణితం, బోటనీ, సివిక్స్ పరీక్షలు జరిగాయి. మధ్యాహ్నం జరిగిన సీనియర్ ఇంటర్ పరీక్షలకు 4895 మంది హాజరుకావాల్సి ఉండగా 4296 మంది హాజరయ్యారు. 525 మంది రెగ్యులర్, 74 మంది ఒకేషనల్ విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్థానిక శ్రీచైతన్య కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో సీనియర్ ఇంటర్ సప్లిమెంటరీ గణితం పరీక్షలు రాస్తున్న ముగ్గురు ప్రైవేటు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డారు. రాష్ట్ర పరిశీలకులు ఆకస్మికంగా పరీక్ష కేంద్రాన్ని తనిఖీచేసి ముగ్గురిని పట్టుకుని డీబార్ చేశారు. ఉదయం జరిగిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 12603 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 11269 మంది మాత్రమే హాజరయ్యారు. జూనియర్ ఇంటర్‌లో 1334 మంది, సీనియర్ ఇంటర్‌లో 599 మంది వెరసి శుక్రవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 1933 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు.

ఐటీఐ ప్రవేశాలకు జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు: ఐటీఐ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రకాశం జిల్లా ఐటీఐ ప్రవేశాల కన్వీనర్ యం.వి.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా నమోదు చేసుకోవాలన్నారు. నమోదుకు సంబంధించిన పత్రాలను ప్రింట్ తీసుకోవాలని, జిల్లాలోని ఒకటి కంటే ఎక్కువ ఐటీఐలను కూడా ఎంపిక చేసుకోవచ్చన్నారు. ముఖ్యంగా దరఖాస్తు చేసిన వారు దరఖాస్తు ప్రింటు కాపీని, ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని సమీప ప్రభుత్వ ఐటీఐలో కచ్చితంగా వెరిఫికేషన్ చేయించుకోవాల్సిందిగా కోరారు. వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న దరఖాస్తులు మాత్రమే ప్రవేశం పొందుతారన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9701271497 ను సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చీమకుర్తి క్రీడాకారులు




రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చీమకుర్తి: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చీమకుర్తిలోని గెలాక్సీ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ బీ.జవహర్, కోచ్ వెంకట్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల్లో ధనుంజయ్‌రెడ్డి, విశ్వనాథ్, సాయిదీపక్, వినయ్‌కుమార్ ఉన్నారు. 26 నుంచి 28 వరకు అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటున్నట్లు కోచ్ తెలిపారు.

లీగల్ కౌన్సిలర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్త్రీశిశు సంక్షేమశాఖలో లీగల్ కౌన్సిలర్‌గా పనిచేసేందుకు ఆసక్తిగల, అర్హులైన న్యాయవాదులు జూన్ 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 జూలై 1వ తేదీ నాటికి 42 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, 5 సంవత్సరాలపాటు న్యాయవాదిగా పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. వీరికి కాంట్రాక్టు వేతనం రూ.35 వేలు ఇస్తారన్నారు. ఎంపికైన న్యాయవాదులు సొంతంగా ప్రాక్టీసు చేయరాదు. ఆసక్తిగలవారు హెచ్‌టీటీపీ://ప్రకాశం.ఎన్ఐసీ.ఇన్/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం సంబంధిత పత్రాలను ప్రింట్ తీసుకుని స్థానిక రాంనగర్ మూడోలైనులోని స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

టీఎస్ ఎంసెట్‌లో కొమరోలు విద్యార్థినికి 47వ ర్యాంకు



చంద్రగిరి వర్షిత

కొమరోలు: కొమరోలుకు చెందిన విద్యార్థిని తెలంగాణ ఎంసెట్‌లో సత్తా చాటింది. గురువారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో 47వ ర్యాంకు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. మండలంలోని యర్రగుంట్ల గ్రామంలోని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రగిరి శ్రీనివాసులు కుమార్తె చంద్రగిరి వర్షిత 47వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. విజయవాడలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ బైపీసీ విద్యను అభ్యసించి 978 మార్కులు సాధించి కోచింగ్ తీసుకున్నట్లు వర్షిత తెలిపింది.

పొగాకు ధర.. డబుల్ సెంచరీ

మార్కెట్లో పొగాకు ధరలు దూసుకుపోతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఒంగోలు రీజియన్ పరిధిలో రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. దాదాపు అన్ని వేలం కేంద్రాల్లో కేజీ ధర డబుల్ సెంచరీ నమోదు చేసుకోగా, ఒంగోలు, కొండపి కేంద్రాల్లో గరిష్ఠ ధర రూ.202 పలికింది. దీంతో రైతుల్లో, వ్యాపారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్ నేపథ్యంలో రికార్డు ధరలు పలుకుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నాణ్యతతో సంబంధం లేకుండా వ్యాపారులు ఉత్పత్తులను కొనుగోలు చేస్తుండడం రైతులకు కలిసివస్తోంది.



పొగాకు బేళ్లు

- పొగాకు రైతుకు లాభాల పంట
- బ్రైట్ గ్రేడ్‌తో సమానంగా లోగ్రేడ్ పొగాకు ఉత్పత్తులకు ధరలు
- ఇప్పటి వరకు జరిగిన వేలంలో కేజీ పొగాకు సరాసరి ధర రూ.195 కు పైగా నమోదు
- గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు ధరలు
- ఒంగోలు, కొండపి కేంద్రాల్లో రూ.202 అత్యధిక ధర నమోదు
- రీజియన్ పరిధిలో 60 మిలియన్ కేజీల అమ్మకాలు

సాక్షిప్రతినిధి, ఒంగోలు ఈ ఏడాది పొగాకు పంట రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నాలుగేళ్లుగా కేజీ ధర గరిష్టంగా రూ.148 నుంచి రూ. 186 మధ్య నమోదైంది. ఈ దఫా బ్రైట్ గ్రేడ్, లోగ్రేడ్ అన్న తేడా లేకుండా రెండు రకాల ఉత్పత్తులకు వ్యాపారులు దాదాపుగా సమాన ధరలు ఇస్తున్నారు. దీంతో కేజీ పొగాకు సరాసరి ధర రూ.195ల వరకు నమోదవుతోంది. కేజీ పొగాకు గరిష్ఠ ధరను కూడా వ్యాపారులు క్రమంగా పెంచే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో వేలం సాగే కొద్దీ ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు పది శాతం మాత్రమే అందుబాటులో ఉండడం కూడా ధరలు పెరిగేందుకు కారణంగా ఉంది. ఇటీవల ముగిసిన కర్నాటక మార్కెట్‌లో ధర రూ.270 కూడా పలికింది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో రేట్లు ఇంకా పెరిగే అవకాశం ఉంది. అయితే వ్యాపారులు మాత్రం రూ.200 స్థిరంగా ఉంచాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలో 11 వేలం కేంద్రాలున్నాయి. వీటిలో ప్రకాశం జిల్లా పరిధిలో ఒంగోలు-1, ఒంగోలు-2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి, పొదిలి, కనిగిరి వేలం కేంద్రాలుండగా, నెల్లూరు జిల్లా పరిధిలో కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాలున్నాయి. సాధారణంగా వీటిని సదరన్ బ్లాక్ సాయిల్స్, సదరన్ లైట్ సాయిల్స్‌గా విభజిస్తుంటారు. అవిధంగా చూస్తే ఎస్‌బీఎస్ పరిధిలో 5 వేలం కేంద్రాలుంటే, ఎస్ఎల్ఎస్ పరిధిలో 6 వేలం కేంద్రాలున్నాయి. ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్ పరిధిలో 2022-23 పంట కాలానికి సంబంధించి బోర్డు 89.35 మిలియన్ కేజీల పొగాకు పండించేందుకు అనుమతిచ్చింది. 107 మిలియన్ కేజీల వరకు రావచ్చునని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది వచ్చిన లాభాలతో రైతులు బోర్డు అనుమతికి మించి పొగాకును సాగు చేశారు. మధ్య మాండూస్ తుఫాన్ మినహాయించి వాతావరణం కూడా సహకరించడంతో దిగుబడులు కూడా పెరుగుతున్నాయి. అదే సందర్భంలో పొగాకు నాణ్యత కూడా మంచిగానే ఉంది. దీంతో ఈ ఏడాది ధరలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి.

సరాసరి రూ.198

పొగాకు నాణ్యతతో సంబంధం లేకుండా వేలంలో పొగాకు ధరలు వస్తున్నాయనడానికి ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన వేలంలో నమోదైన కేజీ పొగాకు సరాసరి ధరలే నిదర్శనం. అన్ని వేలం కేంద్రంల్లోనూ బ్రైట్ గ్రేడ్ పొగాకు గరిష్ఠ ధర రూ 200 వరకు పలుకుతోంది. అయితే కొండపి, ఒంగోలు, కందుకూరు వేలం కేంద్రంలో దీన్ని మించి రూ.202 కూడా నమోదైంది. ఇలా బ్రైట్ గ్రేడ్ పొగాకు కోసమే కాకుండా లోగ్రేడ్ పొగాకు ఉత్పత్తుల కోసం కూడా వ్యాపారులు పోటీ పడుతున్నారు. దీంతో లోగ్రేడ్ ఉత్పత్తులకు కూడా బ్రైట్‌గ్రేడ్ పొగాకుతో సమానంగా ధరలు వస్తున్నాయి. దీంతో కేజీ పొగాకు సరాసరి ధర రికార్డు స్థాయిలో ప్రస్తుతం రూ.198 వస్తోంది. ఇలా అన్ని రకాల ఉత్పత్తులకు సమాన ధర వస్తుండడంతో రైతులు సంబరపడుతున్నారు. దీనికితోడు ఈసారి పొగాకు చూరను కూడా వ్యాపారులు వదలడం లేదు. అంటే పొగాకు వచ్చే పనికిరాని ముక్క, గుల్లను కూడా కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు వస్తున్నారు. ఇటువంటి ఉత్పత్తులను కూడా అమ్ముకునేందుకు బోర్డు అవకాశం కల్పించడంతో రైతులకు లాభాల పంట పడుతోంది.

60.88 మిలియన్ కేజీల అమ్మకాలు

ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ప్రారంభించి దాదాపు మూడు నెలలకు పైగా కావస్తోంది. 11 వేలం కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 60.88 మిలియన్ కేజీల పొగాకును కొనుగోలు చేశారు. వీటిలో ఎస్‌బీఎస్ పరిధిలో 30.94 మిలియన్ కేజీలు, ఎస్ఎల్ఎస్ పరిధిలో 29.94 మిలియన్ కేజీల పొగాకును కొనుగోలు చేశారు. అయితే బోర్డు అధికారుల అంచనా ప్రకారం 107 మిలియన్ కేజీల ఉత్పత్తి వస్తుందని భావిస్తున్నారు. అంటే ఇంకా 46.12 మిలియన్ కేజీల వరకు కొనుగోలు చేయాల్సి ఉంది. దీని ప్రకారం ఈ ఏడాది వేలం ముగియడానికి మరో రెండు నెలలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది.

ధరలు ఆశాజనకంగా ఉన్నాయి

ప్రస్తుతం పొగాకు మార్కెట్ బాగుండడంతో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. సరాసరి ధరలు రూ.198 వరకు నమోదవుతున్నాయి. ఇది రైతులకు మంచి శుభపరిణామం. అలాగే రైతులకు నష్టం లేకుండా వేలాన్ని వీలైనంత త్వరగా ముగించాలనే ఆలోచనలో ఉన్నాం. వచ్చే సీజన్‌కు ఆర్బీకేల ద్వారా పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ ప్రారంభించాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– లక్ష్మణరావు, ఆర్ఎం, ఎస్ఎల్ఎస్

కంభంలో ఏసీబీ అధికారుల దాడులు

- రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉపఖజానా కార్యాలయం సీనియర్ అకౌంటెంట్



నాసర్‌వలి

కంభం: పెండింగ్ బిల్లులు మంజూరు చేసేందుకు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఉపఖజానా కార్యాలయం సీనియర్ అకౌంటెంట్ ఏసీబీ అధికారులకు శుక్రవారం పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం రంగాపురం సచివాలయంలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జాజ వెంకట రవీంద్ర 2021లో మార్కాపురం మండలం నాయుడుపాలెంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో అతనిపై వచ్చిన అభియోగాల మేరకు సస్పెండ్ చేశారు. పది నెలల సస్పెన్షన్ అనంతరం అభియోగాలు రుజువుకాకపోవడంతో తిరిగి అర్ధవీడు మండలం రంగాపురం సచివాలయానికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో పది నెలల సస్పెన్షన్ కాలానికి సంబంధించి కంభం ఉపఖజానా కార్యాలయానికి బిల్లులు పెట్టుకోగా వాటిని రిజెక్ట్ చేశారు. మళ్లీ దరఖాస్తు చేసుకున్నా రిజెక్ట్ చేయడంతో కార్యాలయంలో అడగ్గా సీనియర్ అకౌంటెంట్-2 దూదేకుల నాసర్‌వలి రూ.20 వేలు డిమాండ్ చేశాడు. తాను సస్పెండ్ అయి ఇబ్బందుల్లో ఉన్నానని చెప్పినా వినకపోవడంతో రూ.15 వేలు ఇస్తానని చెప్పి ఒప్పించాడు. అనంతరం ఈనెల 24న రవీంద్ర ఏసీబీ 14400 కాల్ సెంటర్‌కు, ఏసీబీ యాప్ ద్వారా అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కంభం వచ్చిన ఏసీబీ అధికారులు సీనియర్ అకౌంటెంట్ నాసర్‌వలి లంచం తీసుకుంటుండగా పట్టుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నాసర్‌వలిని నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. 20 రోజుల వ్యవధిలో కంభంలో ఏసీబీ అధికారులు రెండో సారి దాడులు నిర్వహించారు. ఈనెల 10వ తేదీన కంభం సబ్ రిజిస్ట్రార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

సంక్షేమ పాలన జగన్‌కే సాధ్యం

- మంత్రి ఆదిమూలపు సురేష్
- పాతచెర్వు తండాలో గడప గడపకు మన ప్రభుత్వం



పాతచెర్వు తండాలో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాధ్యమైందని రాష్ట్ర పురపాలక శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని మల్లాపాలెం సచివాలయ పరిధిలోని పాతచెర్వుతండాలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారు పథకాల ద్వారా పొందిన ప్రయోజనాన్ని వివరించి, బ్రోచర్ అందజేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నట్లుగా మంత్రి సురేష్ చెప్పారు. ఈ సందర్భంగా తండా వాసులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ సీఎం జగనన్న స్వయంగా చూడడం వల్లే నవరత్నాల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పథకాల నగదు జమ చేస్తున్నారని వివరించారు. జగనన్న సంక్షేమ పాలన చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని అన్నారు. నారా లోకేష్ యువగళం పేరిట చేస్తున్న పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు తీరుస్తాననడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబు 600 హామీలను ప్రకటించి ప్రజలను నట్టేట ముంచారని, మా నాయకుడు జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చారని అన్నారు. రాజధానిలో ప్రతి పేదవానికి ఇంటి స్థలం కేటాయించడం ఎంతో శుభపరిమాణం అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి పక్షాల నాయకులు వంద మంది కలిసి వచ్చినా సీఎం జగన్ ఒక్కరే ఎదుర్కొంటారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకుండా ఇంకెవ్వరూ సీఎం కాలేరన్నారు. ప్రజల ఆశీస్సులతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ప్రజలు హర్షధ్వానాల మధ్య అన్నారు

సమస్యలకు పరిష్కారం:

గ్రామంలోని గిరిజనులు పలు సమస్యలను మంత్రి సురేష్ దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించారు. ముఖ్యంగా తండాలోని ఇళ్ల పై నుంచి 33 కేవీ విద్యుత్ లైన్లు వేశారని, వాటి వలన చాలా ప్రమాదాలు జరిగాయని వాటిని తొలగించమని ఎన్నో సార్లు అధికారులకు తెలియచేసినా పట్టించుకోలేదని మంత్రి సురేష్ దృష్టికి తీసుకునిరాగా వెంటనే ఎస్ఈతో మాట్లాడి వాటిని గిరిజనులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఎస్ఈ త్వరలోనే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలోని పొలాలకు వెళ్లి రహదారులు సక్రమంగా లేవని చెప్పడంతో వెంటనే ఏఈ తో మాట్లాడి ఉపాధి పనుల ద్వారా చేయాలని అన్నారు. రామావత్ మారుణీబాయ్ (85) అనే వృద్ధురాలు తనకు జీవనాధారం లేదని మంత్రి దృష్టికి తేగా వెంటనే రూ.10 వేల నగదు అందజేశారు. పలు సమస్యలను పరిష్కరించినందుకు గిరిజనులు మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా గ్రామంలో సురేష్‌కు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వాగ్యానాయక్, సర్పంచ్ రవణరెడ్డి. డీడీవో సాయికుమార్, తహసీల్దార్ దాసు, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఏవో సుధీర్‌బాబు, ఏఈ చంద్రశేఖర్, ఎంపీఎం వెంకటయ్య, ఎంపీటీసీ రాములు, మండల సచివాలయ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, నాయకులు రవణరెడ్డి, రవణయ్య పాల్గొన్నారు.

సమస్య ఏదైనా అండగా నేనుంటా..



వృద్ధుడితో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో బాలినేని భరోసా

ఒంగోలు: సమస్య ఏదైనా అన్నగా తాను అండగా ఉంటానంటూ మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. స్థానిక గోపాలనగర్ ఒకటో లైన్ ఎక్స్‌టెన్షన్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బాలినేని నిర్వహించారు. 5వ డివిజన్‌లో కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన బాలినేనిని ఘనంగా స్వాగతించారు. బాలినేనికి ప్రజలు హారతి ఇచ్చి మరీ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ గతంలో ఒక్క సమస్య వస్తే పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడేవారమని, కానీ నేడు ఆ సమస్య లేదన్నారు. అమ్మ ఒడి డబ్బులు కూడా త్వరలోనే విడుదల చేస్తారన్నారు. వైఎస్సార్ ఆసరా డబ్బులు అందరికీ జమయ్యాయా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం కూడా త్వరలోనే నిర్వహిస్తారని, ప్రతి పేదింటి మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు విమర్శలే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కానీ పనిచేసే వారిపైనే విమర్శలు మెండుగా ఉంటాయని.. ప్రజలు వాస్తవాలు గమనించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, 5వ డివిజన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సత్యన్నారాయణరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, యువజన విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, గందు ధనలక్ష్మి, కండే స్వాతి, తాడి కృష్ణలత, వైఎస్సార్‌సీపీ నాయకులు గోరంట్లపాటి శ్రీనివాసరావు, బొమ్మినేని మురళి, తాళ్లపాలెం శ్రీనివాసరావు, జమ్ము శ్రీకాంత్, మిరియం వెంకటేశ్వర్లు, టి.మోహన్‌రావు, వైఎస్సార్ యాదవ్, ఆసోది విజయలక్ష్మి, వాకా తిరుమలరావు, కండే రమణయ్య యాదవ్, తోటపల్లి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలకల కార్మికుల సమ్మె విరమణ



అగ్రిమెంట్ చూపుతున్న యాజమాన్యం, కార్మిక సంఘాల ప్రతినిధులు

మార్కాపురం: కొన్ని రోజులుగా కూలీలు పెంచాలని డిజైన్ స్లేట్స్ కార్మికులు తాము చేస్తున్న సమ్మెను శుక్రవారం నుంచి విరమించినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, యూనియన్ కార్యదర్శి రూబెన్ చెప్పారు. యాజమాన్యంతో శుక్రవారం జరిగిన చర్చల్లో నూతన వేతన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఆపరేటర్‌కు 8 గంటల డ్యూటీకి రూ.260 నుంచి రూ.297కు, హెల్పర్‌కు రూ.257 నుంచి రూ.294కు, స్ప్లిట్టర్ కార్మికులకు రూ.283 నుంచి రూ.320కి, క్యాలిబ్రేషన్ కార్మికులకు రూ.131.50 నుంచి రూ.150 పెంచారన్నారు. ముజాక్ కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనం పై 14 శాతం ప్రకారం డ్యూటీకి రూ.18 పెంచారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్‌ను చట్ట ప్రకారం ఇవ్వడానికి అంగీకరించారన్నారు. డబుల్ డ్యూటీ చేసిన కార్మికులకు మధ్యాహ్నా భోజనాన్ని క్యాంటిన్ ధర ప్రకారం చెల్లిస్తారని గతంలో అమల్లో ఉన్న ప్రొడక్షన్, ఇతర అన్ని రకాల సౌకర్యాలు యధావిధిగా అమలు చేస్తారన్నారు. ఈ మేరకు యాజమాన్యానికి, కార్మిక యూనియన్‌కు మధ్య అగ్రిమెంట్ జరిగినట్లు తెలిపారు. శనివారం నుంచి కార్మికులు విధులకు హాజరుకావాలని తెలిపారు. చర్చల్లో యాజమాన్యం తరపున వెన్నా పోలిరెడ్డి, గుప్తా ప్రసాద్, మోరా వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, రామ్స్, యక్కలి కోటి, రమణ, కాపర్‌రెడ్డి, చాటికొండ నాగరాజు, తిరుపతయ్య, కే వేణుగోపాల్ రెడ్డి, లక్ష్మీరెడ్డి, రత్నం, ధనరాజు పాల్గొన్నారు. కార్మికుల తరపున బాలశేషయ్య, రాములు, ప్రకాశం, శేషగిరి, అశోక్, కొండయ్య, వెంకటేశ్వరరెడ్డి, అంజి, ఆదిరెడ్డి, కొండలు తదితరులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

రాచర్ల: సీతారామచంద్ర స్వామి ఆలయ స్థిర ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా వచ్చే నెల 1, 2 తేదీల్లో యడవల్లి పంచాయతీ పరిధిలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ రెండు పండ్ల సైజు, రెండో తేదీ ఆరు పండ్ల సైజు ఎడ్ల పందేలు జరుగుతాయన్నారు. ఆసక్తిగలవారు ఆయా తేదీల్లో ఉదయం పది గంటల లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రెండు పండ్ల సైజు ఎడ్లపందేల విజేతలకు మొదటి, రెండో, మూడో, నాలుగు, ఐదు, ఆరు బహుమతులు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు అందజేస్తారు. ఆరు పండ్ల సైజు ఎడ్లపందేల విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25, రూ.15, రూ.10, రూ.5 వేలను అందజేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 99590 76883, 98858 59298 సెల్ నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్



ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాస్

యర్రగొండపాలెం: జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.శ్రీనివాస్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మిల్లంపల్లిలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలనీలో గృహ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నీరు అందేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. రూ.10 లక్షలు ఖర్చుపెట్టి 4 డీప్‌వెల్ బోర్లు వేసినా అందులో రెండు బోర్లలో మాత్రమే నీరు వస్తుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రోజుకు రెండు ట్యాంకర్ల నీటిని కాలనీకి సరఫరా చేస్తున్నామని, మరో రెండు ట్యాంకర్లు అదనంగా నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, అందుకు నిధులు కేటాయించాలని కోరారు. కాలనీ లేఅవుట్‌లో ఉన్న డబుల్ ఎంట్రీలను తక్షణమే పరిష్కరించాలని, లేఅవుట్‌లో ఎరిఫికేషన్ చేసిన రిపోర్టును వెంటనే తహసీల్దార్‌కు అందచేయాలని ఆదేశించారు. హౌసింగ్ లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణం అందేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సేథు మాధవన్, హౌసింగ్ పీడీ పేరయ్య, ఈఈలు వెంకటస్వామి, మర్దన్‌అలీ, డీఈ రమేష్, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ కె.దాస్, ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు, ఎంఈవో పి.అంజనేయులు, ఏఈలు శ్రీకాంత్, అంజిరెడ్డి, అల్లూరయ్య, ఏపీఎం ఎం.వెంకిరెడ్డి, సర్పంచ్‌లు ఏకుల మునలారెడ్డి జయమ్మ, అరుణాబాయి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సయ్యద్ జబీవుల్లా పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీశైలం డ్యాంలో రైతు మృతి



వెంకటేశ్వరరెడ్డి మృతదేహం

యర్రగొండపాలెం: శ్రీశైలం డ్యాం దిగువన తెలంగాణ రాష్ట్రం పరిధిలోని లింగాలగట్టు నదిలో స్నానం చేయడానికి దిగి ప్రమాదవశాత్తూ గల్లంతై రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. యర్రగొండపాలెం మండలంలోని గురిజేపల్లి గ్రామానికి చెందిన 10 మంది రైతులు మద్దిమడుగు ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి వెళ్లారు. స్వామివారి దర్శనం అనంతరం లింగాలగట్టు వద్దకు వెళ్లి స్నానం చేయడానికి నదిలో దిగారు. వారిలో కందుల వెంకటేశ్వరరెడ్డి(40) గల్లంతవగా, మహబూబ్‌బాద్ జిల్లా అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నదిలో మృతదేహం లభ్యమైనట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ

వీరారెడ్డిపల్లి (హనుమంతునిపాడు): నిద్రిస్తున్న మహిళ మెడలోని రూ.1.60 లక్షల విలువైన మూడు సవర్ల బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన మండలంలోని కొండారెడ్డిపల్లి పంచాయతీలో గల వీరారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. హనుమంతునిపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉడుముల ఆదిలక్ష్మమ్మ గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి గొలుసు లాక్కుని పరారయ్యారు. ఆమె మేల్కొని కేకలు పెట్టేలోపే చెట్లలోకి వెళ్లిపోయారు. గురువారం పగలు భిక్షగాళ్లు రాగా, అన్నం పెట్టానని, వారు ఆ సమయంలో తన మెడలోని గొలుసు చూడటం గమనించానని, రాత్రి వేళ వారే వచ్చి గొలుసు లాక్కెళ్లి ఉంటారని పోలీసులకు బాధితురాలు తెలిపింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయకపోయినప్పటికీ.. పోలీసులే సమాచారం తెలుసుకుని వచ్చి విచారించారు.

అవినీతిపై ఉక్కుపాదం

- లంచాలు తీసుకుంటున్న అధికారుల భరతం పడుతున్న ఏసీబీ
- కంభంలో వరుసగా మెరుపు దాడులు
- 16 రోజుల వ్యవధిలో ఇద్దరు అవినీతి అధికారుల పట్టివేత
- అవినీతి అధికారుల గుండెల్లో గుబులు

కంభం:రాష్ట్రంలో అవినీతిరహిత పాలనే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. డీజీపీ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలపై మెరుపు దాడులు చేస్తూ అవినీతి అధికారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారు. 14400 నంబర్ ద్వారాగానీ, నేరుగాగానీ ఏసీబీ అధికారులను సంప్రదించగానే స్పందిస్తున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుని వెంటనే ఆకస్మిక దాడులు చేస్తూ అవినీతి అధికారుల భరతం పడుతున్నారు. అందులో భాగంగా ఈ నెల 10వ తేదీ కంభం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడిచేసిన ఏసీబీ అధికారులు.. 16 రోజుల్లోనే శుక్రవారం మరోసారి కంభం ఉపఖజానా కార్యాలయంపై దాడి చేసి అవినీతి అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



దర్శిలోని సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామమూర్తి ఇంటిని సీజ్ చేస్తున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

మూడేళ్ల క్రితం కంభం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడి...

మూడు సంవత్సరాల క్రితం కంభం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు నిర్వహించిన ఏసీబీ అధికారులు.. ఓ అధికారిని పట్టుకున్నారు. అప్పట్లో కొంతకాలం బాధ్యతగా పనిచేసిన అధికారులు, సిబ్బంది ప్రస్తుతం మళ్లీ అవినీతి బాటపట్టారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజల నుంచి వేలాది రూపాయల లంచాలు వసూలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారి డాక్యుమెంట్లలో ఏం లొసుగు దొరుకుందా.. ఎంత లాగుదామా అన్నట్లు ఎదురుచూస్తున్నారు.

ఈసారి ఏసీబీకి చిక్కేదెవరో...

పశ్చిమ ప్రకాశంపై ఏసీబీ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా ఫిర్యాదులొస్తున్నాయని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ శాఖలో కొందరు వీఆర్వోలు రైతుల నుంచి లంచాలు ఎక్కువగా తీసుకుంటున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులకు తాము ఎక్కడ చిక్కుతామోనని వీఆర్వోలలో టెన్షన్ మొదలైంది. ఇంకా కొన్ని శాఖల అధికారులు అవకాశం దొరికినప్పుడల్లా ప్రజల నుంచి అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇటీవల కాలంలో ప్రజల్లో కొంతమేర చైతన్యం వచ్చి లంచావతారులను ఏసీబీకి పట్టిస్తుండటంతో అవినీతి అధికారులు కటకటాల పాలవుతున్నారు.

16 రోజులకే ఉపఖజానా కార్యాలయంలో...

కంభం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సంఘటన జరిగిన 16 రోజులకే శుక్రవారం కంభం ఉపఖజానా కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్ దూదేకుల నాసర్‌వలి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకోవడం సంచలనంగా మారింది. అర్ధవీడు మండలం రంగాపురం సచివాలయంలో ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జాజా వెంకట రవీంద్ర వద్ద జీతం బిల్లులు విడుదల చేసేందుకు రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించారు. ఉపఖజానా కార్యాలయంలోకి ఏసీబీ అధికారులు వచ్చారని తెలియడంతో పక్కనే ఉన్న రెవెన్యూ, ఎంపీడీవో, పంచాయతీరాజ్ కార్యాలయాల్లో సైతం అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. ఏసీబీ అధికారులు వచ్చారన్న వార్త విన్న కొందరు డాక్యుమెంట్ రైటర్లు వారి గదులకు తాళాలు వేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నుంచి పరారయ్యారు.

మారువేషంలో ఏసీబీ అధికారులు...



ఈ నెల 10న కంభం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో రైతు వేషంలో ఉన్న ఏసీబీ అధికారి

ఏసీబీ అధికారులు అవినీతి అధికారులపై దాడి చేసేందుకు పక్కా ప్లాన్‌తో వస్తున్నారు. ఏ కార్యాలయంలో దాడి చేసేందుకు వస్తున్నారో ఆ కార్యాలయంలో రెండుమూడు రోజుల ముందు నుంచే మారువేషంలో తిరుగుతూ అన్నీ గమనిస్తున్నారు. అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్నారు. కంభం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దాడి చేసిన సమయంలో రైతుల వేషంలో వచ్చిన అధికారులు.. పనుల కోసం వచ్చినట్లుగా నమ్మించి వివరాలన్నీ సేకరించారు. ఉపఖజానా కార్యాలయంలో దాడి చేసేందుకు కూడా రెండు రోజుల పాటు కాపు కాసినట్లు తెలిసింది.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి : శ్రీనివాసరావు, ఏసీబీ డీఎస్పీ



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ

ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా అధికారులు, ఉద్యోగులు లంచం అడిగితే 14400 నంబర్‌కు కాల్ చేయడంగానీ, నేరుగా ఏసీబీ కార్యాలయంలోగానీ ఫిర్యాదు చేయండి. అవినీతి అధికారులు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకుంటాం. వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటాం.

10వ తేదీ సబ్‌రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్ పట్టివేత...



ఈ నెల 10న ఏసీబీకి చిక్కిన కంభం సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామమూర్తి

కందులాపురానికి చెందిన సాకం కృష్ణరంగారెడ్డి తన భార్య జ్యోతి పేరు మీద కొనుగోలు చేసిన 205 గజాల స్థలం రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 8వ తేదీ కంభం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అతని స్థలానికి సంబంధించి సర్వే నంబర్ కావాలని చెప్పగా.. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆ సర్టిఫికెట్ తీసుకొచ్చారు. ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.40 వేలు లంచం డిమాండ్ చేయడంతో రూ.15 వేలు ఇస్తానని ఒప్పుకుని.. లంచం ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సిబ్బందితో కలిసి 10వ తేదీ దాడి చేసిన ఏసీబీ అధికారులు.. రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా, సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్‌ను పట్టుకున్నారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామమూర్తి స్వగ్రామమైన దర్శిలోని ఆయన నివాసంలో కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

యర్రగొండపాలెం: స్థానిక ఓ నగల షాపులో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని శనివారం అరెస్ట్ చేసినట్లు యర్రగొండపాలెం ఎస్సై జి.కోటయ్య తెలిపారు. ఈ నెల 23వ తేదీ హబీబుల్లా జ్యూవెలరీ షాపులో బంగారం, వెండి చోరీ జరిగింది. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీ కెమేరా పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. రెండు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టి త్రిపురాంతకం మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన నిందితుడు కె.ఏడుకొండలును అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.90,500 విలువ చేసే రెండు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.15,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రయాణికుడి వద్ద రూ.50 వేలు చోరీ

మార్కాపురం: కడప జిల్లా గోపాలపురం మండలం ఉప్పలివారి గ్రామానికి చెందిన బైరిశెట్టి మధు శుక్రవారం శ్రీశైలం నుంచి మార్కాపురం వచ్చాడు. ఇక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్నాడు. ఆ సమయంలో తన జేబులో ఉన్న రూ.50 వేల నగదు మాయం కావడంతో ఆందోళనకు గురయ్యాడు. జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించడంపై బస్టాండ్‌లోని ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. అయితే, ఈ సంఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ఫోన్ ద్వారా రూ.87 వేలకు కన్నం

గిద్దలూరు రూరల్: ఓ కేటుగాడి చేతిలో వస్త్ర వ్యాపారి మోసపోయిన సంఘటన గిద్దలూరు పట్టణంలోని రేడియో బావి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై బ్రహ్మానాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. గిద్దలూరులోని సంగీత రెడిమేడ్ ఫ్యాషన్ వస్త్ర వ్యాపారి రమణారెడ్డి వద్దకు వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ఓ గుర్తుతెలియని వ్యక్తి వెళ్లాడు. రూ.2 వేలకు వస్త్రాలు కొనుగోలు చేశాడు. తన వద్ద నగదు లేవని, ఫోన్ ద్వారా పంపిస్తానని తెలిపాడు. ముందుగా మీ ఫోన్ నుంచి ఒక రూపాయి పంపండి అని వ్యాపారిని అడిగాడు. ఆ వస్త్ర వ్యాపారి ఒక రూపాయి పంపేందుకు ప్రయత్నించగా.. ట్రాన్స్‌ఫర్ కాలేదు. దీంతో ఆ వస్త్ర వ్యాపారి ఫోన్ అతడి చేతికే ఇచ్చి మీరే పంపుకోండి అని చెప్పాడు. అదే అదునుగా ఆ గుర్తు తెలియని వ్యక్తి రూపాయికి బదులుగా రూ.87 వేలు పంపుకుని అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నాడు. కాసేపటి తర్వాత గుర్తించిన వ్యాపారి.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరోమా పంటలతో ఆర్థిక పరిపుష్టి

- సుగంధ పంటల సాగును ప్రోత్సహించేలా ప్రణాళికలు
- ఆరోమా మేనేజింగ్ డైరెక్టర్ రమాకాంత్ హర్లాల్‌కా
- మిషన్ ఆరోమాలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేసి మిషన్ ఆరోమా అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న నిషాంత్ ఆరోమా ఎండీ రమాకాంత్ హర్లాల్‌కా, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఆరోమా పంటల సాగుతో రైతులకు ఆర్థిక పరిపుష్టి గణనీయంగా పెరుగుతుందని నిషాంత్ ఆరోమా మేనేజింగ్ డైరెక్టర్ రమాకాంత్ హర్లాల్‌కా అన్నారు. సుంగంధ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించేలా వారికి తగిన అవగాహన కల్పించేందుకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో శుక్రవారం రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమాకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో సుగంధ పంటల సాగును ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ఆరోమా మిషన్ పేరుతో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. నేల స్వభావాన్ని బట్టి నీటి వనరుల ఆధారంగా దేశ వ్యాప్తంగా ఈ పంటల సాగుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేసి స్థానిక రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నిమ్మ గడ్డి, కాశగడ్డి, కామాక్షి కసువు, వట్టివేరు సుంగంధ పంటల సాగుకు విస్తారమైన అవకాశం ఉందన్నారు. వాటిని సాగు చేస్తే ఐదేళ్లలో రైతుల ఆర్థిక స్థితి గణనీయంగా మెరుగవుతుందన్నారు. పుష్కలంగా మార్కెటింగ్ అవకాశాలున్న ఈ పంటలు సాగుచేస్తున్న రైతులు లబ్ధి పొందిన తీరును రమాకాంత్ వివరించారు. గురువారం జిల్లాకు వచ్చిన తాను చీమకుర్తి, కొత్తపట్నం మండలాల్లో పర్యటించి సుంగంధ పంటల సాగును పరిశీలించినట్లు తెలిపారు.

☛ కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ నేల స్వభావాన్ని, మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. నీళ్లు, రసాయనాల వినియోగం అవసరం పెద్దగా లేకుండా అధిక లాభాలు వచ్చే సుంగంధ పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ పంటల సాగును ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆసక్తి ఉన్న రైతులను ఇతర జిల్లాలకు పంపిస్తామన్నారు. ఏపీఎంఐపీ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి అశోక్‌కుమార్ మాట్లాడుతూ సుంగంధ పంటల సాగుకు ప్రభుత్వం నుంచి లభించే సహాయ సహకారాలను వివరించారు. జిల్లాలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని తమకు కేటాయిస్తే స్థానికంగా ఈ మొక్కలు సాగు చేసి రైతులకు అందజేస్తామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ సరికొత్త రకాలు సాగుచేసేందుకు రైతులు కూడా ఆసక్తితో ఉన్నారన్నారు. ఆ దిశగా ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు. సీఐఎంఏపీ సీనియర్ శాస్త్రవేత్తలు కిరణ్‌బాబు, సత్య శ్రీనివాస్, కోటేష్‌కుమార్, వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్శిటీ సీనియర్ శాస్త్రవేత్త అపర్ణ పంటల సాగు విధానాలను రైతులకు వివరించారు. పంటలకు పెరుగుతున్న మార్కెట్ అవకాశాలను పారిశ్రామికవేత్తలు పి.వెంకటపతి, ప్రసాద్ తెలిపారు. జిల్లాలో 250 మంది రైతులు సుమారు 1000 ఎకరాల్లో సుగంధ పంటలు సాగుచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ శౌర్యపటేల్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రబాబు, ఆత్మ పీడీ అన్నపూర్ణ, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్ర, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ ధ్వంసం

- రోడ్డంతా ఆయిల్ పడటంతో జారిన వాహనాలు
- పలు వాహనాలు ఢీకొని కొందరికి స్వల్పగాయాలు



ప్రమాదానికి గురైన లారీ

ఒంగోలు టౌన్: నగరంలోని దక్షిణ బైపాస్‌లో టంగుటూరువైపు వెళ్లే రోడ్డుపై రైజ్ కాలేజీ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆయిల్ ట్యాంకర్ ధ్వంసమైంది. రోడ్డంతా ఆయిల్ పడి వాహనాలు జారడంతో పాటు పలు వాహనాలు ఢీకొట్టుకున్నాయి. ఆయా వాహనాల్లోని వారికి స్వల్ప గాయాలే కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఒంగోలువైపు నుంచి నెల్లూరువైపు వేగంగా వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్.. ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేయబోయింది. ఆ సమయంలో ట్యాంకర్ అదుపుతప్పి వెనుక భాగం టిప్పర్‌కు తగిలింది. దీంతో ట్యాంకర్ మొత్తం చీలిపోయి అందులోని రైస్ ఆయిల్ రోడ్డు మీద పడిపోయింది. సుమారు 200 లీటర్ల వరకు ఆయిల్ పడటంతో టంగుటూరు వరకు రోడ్డంతా జిడ్డుగా తయారైంది. జిడ్డు కారణంగా నెల్లూరు వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సుకు బ్రేకులు పడక ట్యాంకర్‌ను ఢీకొట్టింది. బస్సు వెనుక వచ్చిన మరో లారీ కూడా బస్సును ఢీకొట్టింది. బస్సులో 35 మంది ప్రయాణికులు ఉండగా, అదృష్టవశాత్తూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. అర్ధరాత్రి నిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గాయపడిన బస్సు డ్రైవర్ మల్లికార్జునరావును ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్వల్పంగా గాయపడిన లారీ డ్రైవర్‌తో పాటు పలువురు ప్రయాణికులను రిమ్స్‌కు తరలించారు. అగ్నిమాపకశాఖకు చెందిన రెస్క్యూ టీం రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చింది. ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి పోలీసులు క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.